క్లుప్తంగా

వాటర్ ట్యాంక్‌తో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని తీసుకువెళ్తున్న కాలనీవాసులు

సాక్షి స్పందన

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో బోరు మోటారు చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ తీరును వివరిస్తూ 'రాజారంలో నీటి కష్టాలు' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాత్కాలికంగా ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. బోరుమోటారుకు మరమ్మతు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు.

కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

భీమిని: కన్నెపల్లి మండలం ఎల్లారం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బాగల సంతోష్‌కు ఆదివారం పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సంతోష్ ఇంటికి వెళ్తుండగా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఇంటికి చేరుకున్నారు. పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

ఆర్థికసాయం

చెన్నూర్: పట్టణంలోని వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నెల రజితకు వివాహ ఖర్చుల నిమిత్తం రూ. 15,350 ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గౌరవ అధ్యక్షుడు కారెంగుల రామయ్య, అధ్యక్షుడు రామస్వామి, ఉపాధ్యక్షుడు చందర్, ప్రధాన కార్యదర్శి ఖలీల్‌భాయ్, కోశాధికారి జగదీశ్ తదితరులు ఉన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పెద్దంపేటకు చెందిన వేల్పుల లక్ష్మి–పద్మయ్య దంపతుల కుమార్తె అఖిల వివాహానికి ఆదివారం ఆర్థిక చేయూత అందించారు. మాజీ సర్పంచ్ పొట్టాల సుమలత–శ్రీశైలంగౌడ్ రూ.7,500, 25 కిలోల బియ్యం, కర్ణమామిడి పీఏసీఎస్ చైర్మన్ కోటె సత్తయ్య రూ.5 వేలు, డీసీసీ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు రూ.2,500ల ఆర్థికసాయం అందజేశారు.

భగీరథ అందక..నీటి కష్టాలు



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో బోరు మోటారు చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. గ్రామానికి భగీరథ నీరందడంతో సంతోషించిన కాలనీవాసులకు అధికారుల నిర్లక్ష్యంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల చెడిపోయిన భగీరథ పైపులైన్లు మరమ్మతు చేశామని చెబుతున్నారు. అయితే మరుసటి రోజు నుంచే నీటి సరఫరా లేక పొలాల్లో సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తున్నారు. నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ బోరు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకుని నీటి కష్టాలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్: గౌడ వెల్ఫేర్ సంఘం పట్టణ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కంభగోని సుదర్శన్‌గౌడ్, నీలం శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షుడిగా గండి కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ భూమయ్యగౌడ్, కార్యదర్శిగా బుడిగె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పంజాల సంపత్, తాళ్లపల్లి కుమారస్వామి, నరసింహం, కోశాధికారిగా మామిడి తిరుపతి, సహాయ కోశాధికారిగా మద్ది సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కోటపల్లి: రామగుండం సీపీ ఆదేశాలతో కొల్లూర్, రాంపూర్ గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో మంచిర్యాల పవన్ ఆప్టికల్ నేతృత్వంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వృద్ధులు, కంటి సమస్యలతో బాధపడుతున్న 32 మందికి వైద్యసిబ్బంది పరీక్షించారు. సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

భీమిని: మండలంలోని మల్లీడి గ్రామంలోని శ్రీ శివ పంచాయతన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు మనోహరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

వెలగని లైట్లు



నెన్నెల: నాలుగు కూడళ్ల మధ్య ఏర్పాటు చేసిన హైమాస్ట్ (ఆకాశ) దీపాలు పగలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. రాత్రియితే చాలు దీపాలు అంధకారంలో మగ్గుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో మొత్తం 35 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. అందులో సగానికిపైగా వెలుగులు పంచడం లేదు. దీంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన దీపాలు ముణ్నాళ్ల ముచ్చటగానే మారాయని ప్రజలు చెబుతున్నారు.

రోడ్లపైనే వాహనాలు



భీమారం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి హైస్కూల్ వెళ్లే దారిపై వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బస్టాండ్ నుంచి వచ్చే ప్రయాణికులు హైస్కూల్ రోడ్డు గల ఓ వైపు షాపుల ఎదుట బైక్‌లు నిలిపివేస్తున్నారు. వివిధ సామగ్రితో వచ్చే వాహనాలు అన్‌లోడ్ అయ్యేవరకు రోడ్డుకి అడ్డంగా పెడుతున్నారు. దీంతో బైక్‌లు వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా పోలీసులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదోడి ఫ్రిజ్



నెన్నెల: ఎండలు మండుతున్నాయి. ప్రజలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి చల్లని నీటిని తీర్చుకుంటున్నారు. ప్రస్తుతం చాలామంది సహజసిద్ధంగా ఉండే మట్టికుండలు వినియోగిస్తున్నారు. విక్రయదారులు ఆదిలాబాద్, రాజస్థాన్ నుంచి కుండలను దిగుమతి చేసుకుంటున్నారు. రహదారి వెంట చిరు వ్యాపారులు మట్టి కడవలను విక్రయిస్తున్నారు. పరిమాణాన్ని బట్టి రూ.200 నుంచి రూ.400 ధర పలుకుతున్నాయి.

రోడ్లకు మహర్దశ



నస్పూర్‌కాలనీ ప్రధాన రోడ్డుపై తారు వేస్తున్న దృశ్యం

- కాలనీల్లో తారు రోడ్ల నిర్మాణాలు
- సింగరేణి రూ.99 లక్షలతో పనులు

శ్రీరాంపూర్: సింగరేణి రోడ్లకు మహర్దశ వచ్చింది. చాలా కాలంగా కాలనీల్లో రోడ్లు గుంతలమయం అయ్యాయి. ఇన్నాళ్లు కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనికి కంపెనీ అధికారుల చెక్ పెడుతున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీల్లో కార్మిక కుటుంబాలు అధికంగా నివాసం ఉంటాయి. ఈ కాలనీల్లో ప్రధాన రోడ్లు చెడిపోయాయి. గతంలోనే అంతర్గత రోడ్లు నిర్మించిన కంపెనీ ప్రధాన రోడ్లను వేయకుండా వదిలేసింది. ఇప్పుడు ఈ పనులను ప్రారంభించింది. అన్ని ప్రధాన రోడ్లపై తారు పనులు మొదలుపెట్టింది. సుమారు 5 కి.మీ తారు రోడ్లు వేస్తున్నారు. దీనికి కంపెనీ రూ.99 లక్షలు వెచ్చించింది. ఇప్పటికే నస్పూర్ షిర్కే నుంచి నస్పూర్ కాలనీ హనుమాన్ ఆలయం వరకు పనులు పూర్తయ్యాయి. ఇతర ప్రధాన రోడ్ల పనులు నడుస్తున్నాయి. ప్రస్తుతం నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీలోని ప్రధాన రోడ్లకు ఈ తారు టెండర్ల వేసి పనులు మొదలు కాగా, ఇంకా నాగార్జునకాలనీకి కూడా ప్రధాన రోడ్లువేయాల్సి ఉంది. దీనికి ఏరియా సివిల్ అధికారులు టెండర్ నోట్ తయారు చేసి కార్పొరేట్ అధికారులకు పంపారు. ఇక్కడ కూడా 5 కి.మీ నిడివితో తారు రోడ్లు వేయాల్సి ఉంది. వేసవి ముగిసేసరికి ఈ పనులు పూర్తికానున్నాయని ఏరియా సివిల్ (ఈఈ) సత్యనారాయణ తెలిపారు.

రాత్రిపూట పనులు

ఇదిలా ఉంటే అన్ని కూడా ప్రధాన రోడ్లు కావడంతో పగటి పూట చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు తారు వేసిన వెంటనే వాహనాలు వెళ్లడం వల్ల రోడ్లు త్వరగా చెడిపోయే ప్రమాదం ఉంది. దీంతో అధికారులు రాత్రి ఈ పనులు చేస్తున్నారు. అన్ని ప్రధాన రోడ్లే కావడంతో రాత్రివేళల్లో పనులు చేయాల్సి వస్తుందని వారు తెలిపారు.

అశాస్త్రీయంగా స్పీడ్‌బ్రేకర్

ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటులో ఏమాత్రం శాస్త్రీయ ధోరణి లేదు. ఎక్కడపడితే అక్కడ పెట్టడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఇంటర్నల్ రోడ్ల చివరల్లో కూడా స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. మళ్లీ అవి పోను ప్రధానరోడ్లపై నేడు స్పీడ్‌బ్రేకర్లు పెట్టడం సరికాదని వాహనదారులు పేర్కొంటున్నారు. అవసరంలేని చోట స్పీడ్‌బ్రేకర్లు పెట్టడం వల్ల రోడ్లు కూడా త్వరగా చెడిపోయే అవకాశం ఉంది. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు.

ఒక్కటైన దివ్యాంగ జంట

- పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన బస్తీవాసులు



పెళ్లితో ఒక్కటైన దివ్యాంగ జంట

బెల్లంపల్లి: దివ్యాంగులైన వధూవరులకు సంప్రదాయ బద్ధంగా పెళ్లి జరిపించి ఉదారతను చాటుకున్నారు పలువురు మానవతావాదులు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఇరు కుటుంబాలకు అండగా నిలబడి మూడు ముళ్లబంధంతో దివ్యాంగులను ఏకం చేసి ఆశీర్వదించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన కన్నూరి రాయమల్లు, ఓదెలు దంపతుల ద్వితీయ పుత్రుడు రమేశ్‌కు, బెల్లంపల్లి మున్సిపాలిటీ అశోక్‌నగర్ బస్తీకి చెందిన తమ్మిడి భాగ్యమ్మ, సత్తయ్యల తృతీయ కుమార్తె ప్రేమలతతో పెళ్లికి పెద్దలు నిర్ణయించారు. రమేశ్‌కు కంటి చూపు లేకపోగా, పోలియోతో ప్రేమలత కాళ్లు చేతులు సచ్చుబడి ఉన్నాయి. వధూవరులిద్దరు దివ్యాంగులు. పేదలైన వీరి కుటుంబాల స్థితి తెలుసుకున్న బస్తీవాసులు ఆ పెళ్లి జరిపించడానికి ముందుకు వచ్చారు. ఆదివారం బెల్లంపల్లిలోని శివాలయంలో పెళ్లి పెద్దలుగా వ్యవహరించి అట్టహాసంగా వివాహ తంతును జరిపించారు. మాజీ కౌన్సిలర్లు రమేశ్, అశోక్‌గౌడ్, సామాజిక కార్యకర్త దుర్గరాజేష్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, డెప్యూటీ రేంజ్ అధికారి గౌరి శంకర్, వెంకటేశ్, సురేందర్, తిరుపతి వర్మ, సురేష్, రవికుమార్, బస్తీవాసులు, యువకులు తలాకొంతసాయం చేసి వధూవరులకు వస్తు సామగ్రిని సమకూర్చారు. పసందైన విందు భోజనం పెట్టి ఏ లోటు లేకుండా దివ్యాంగుల పెళ్లి జరిపించారు.

బొగ్గుబాయి వార్తలు

నోటిఫికేషన్ రద్దు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో రెండు కీలక అధికార పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించే నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, బ్రాంచికార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి బయటవారితో కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడానికి నోటిఫికేషన్ ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో పాత విధానాన్ని రద్దుచేసి ఏకపక్షంగా యజమాన్యం వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులకు నష్టం కలిగే ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పదేళ్లయినా అసంపూర్తిగా..



అసంపూర్తి పనులతో కొత్తగా నిర్మించిన భవనం



అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రానికి పక్కా భవనం లేక కొన్నేళ్లుగా అద్దెఇంట్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రానికి పదేళ్ల క్రితం పక్కా భవనం మంజూరైంది. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన నిర్మించారు. భవనం పనులు ఇప్పటికి అసంపూర్తిగా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయడం లేదు. ఆరోగ్యశాఖకు అప్పగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఆరోగ్య ఉపకేంద్రాన్ని అరకొర వసతుల నడుమ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయమై మండల వైద్యాధికారి సతీశ్‌ను సంప్రదించగా, కొత్తగా నిర్మించే ఆరోగ్య ఉపకేంద్రం పనులు పదేళ్లయినా పూర్తికాలేదు. ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా ఉండటంతో దానిని మేము తీసుకోలేదన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్‌లో రైతు గోనె సతీశ్ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆదివారం సందర్శించారు. సతీశ్ సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. గోశాలలో కంపోస్టు ఎరువులను పరి శీలించి రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. శాస్త్రవేత్తలు శివకృష్ణ, తిరుపతి ఉన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ లెవల్ ఓపెన్‌టు ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో మంచిర్యాల జ్యోతిబాపూలే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కటాస్ విభాగంలో లక్ష్మీప్రసన్న, శాన్వీ, శ్రీనిత్య, స్వాతిక గోల్డ్‌మెడల్స్, చందనప్రియ, ప్రసన్న, వైష్ణవి సిల్వర్ మెడల్స్ సాధించారని ప్రిన్సిపాల్ రజిత తెలిపారు.

పొట్టి శ్రీరాములు జయంతి

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

గోదావరి పుణ్యస్నానాలకు తరలిన ముదిరాజ్‌లు

భీమారం: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్‌లు ఆదివారం చెన్నూర్‌లోని గోదావరి పుణ్యస్నానానికి తరలివెళ్లారు. గ్రామంలోని శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో సోమవారం కల్యాణ మహోత్సవంతోపాటు బోనాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముదిరాజ్ కుటుంబాలు ఉపవాస దీక్షతో ఉండి గ్రామదేవతలు లక్ష్మీ దేవరతోపాటు డప్పు వాయిద్యాలతో కాలినడకన గోదావరిలో స్నానాలు చేసేందుకు వెళ్లారు.



పొన్నారం జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం జెడ్పీ హైస్కూల్‌లో 1992–93లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. అలాగే పట్టణంలోని ఆదర్శ విద్యానికేతన్‌లో 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు చదువులమ్మ ఒడికి చేరారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



ఆదర్శ విద్యానికేతన్‌లో పదో తరగతి పూర్వ విద్యార్థులు

గనుల్లో షిఫ్ట్ వేళలు మార్చాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా గనుల్లో షిఫ్ట్ వేళలు మార్చాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, అల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై మినరల్ వాటర్ ప్లాంట్లు, ఫ్రిజ్‌లు ఏర్పాటు చేయాలని, ఎండలో పనిచేసే కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని కోరారు. నాయకులు రామగిరి రామస్వామి, ఐలయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బైక్ చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో శ్రీనివాస టాకీస్ వెనుకాల ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైందని ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..రోజు మాదిరిగా ఈనెల 14న అభిషేక్ రేణ్వా తన బైక్‌ను ఇంటి ఆవరణలో సాయంత్రం పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి కనిపించడం లేదు. చుట్టుపక్కల వెతికిన దొరకకపోవడంతో ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జైపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకోగా, పట్టుబడిన ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లి: దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బెల్లంపల్లి/దండేపల్లి/భీమిని/లక్సెట్టిపేట/కాసిపేట/తాండూర్/మందమర్రిరూరల్/చెన్నూర్: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. టీపీసీసీ పిలుపుతో జిల్లాలోని పలుచోట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. బెల్లంపల్లి బజారుఏరియాలో సర్దార్ భగత్‌సింగ్ విగ్రహం ఎదుట దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు శ్రీనివాస్, మనోహర్, విజయ్, రాములు నాయక్, ఆకాశ్, ప్రతాప్, రాజేష్, దుర్గం గోపాల్, బుర్స గోపాల్, సాయికిరణ్, కుమార్, సతీశ్ పాల్గొన్నారు. దండేపల్లిలో ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు రాకేశ్, విజయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ ఉన్నారు. భీమిని, కన్నెపల్లిలో పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,రామాంజనేయ, నియోజక వర్గ యూత్ ఉపాధ్యక్షుడు రోహిత్ పాల్గొన్నారు. లక్సెట్టిపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నేతలు రాస్తారోకో అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు రమేశ్, నాగభూషణం, ఆరీఫ్, అశోక్ పాల్గొన్నారు. కాసిపేట మండలం కొండపూర్ యాపలో మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు. తాండూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు మహేందర్‌రావు పాల్గొన్నారు. మందమర్రి పాత బస్టాండ్ కూడలి వద్ద దిష్టిబొమ్మలను దహనం చేశారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ నయీమ్ ఉన్నారు. చెన్నూర్‌లో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

విద్యార్థుల ఆందోళన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎస్సీ బాలుర పోస్టుమెట్రిక్ హాస్టల్ విద్యార్థులు ఆదివారం ఆందో ళన చేపట్టారు. వార్డెన్ భోజనం సరిగా పెట్ట డం లేదని హాస్టల్ ఎదుట కొద్దిసేపు ఆందోళనకు దిగారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా వార్డెన్ నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. వార్డెన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోచమ్మ కొలుపు



పూజలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీలో ముత్యాల పోచమ్మ తల్లి కొలుపు జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు, వంగ తిరుపతి, గరిసే రామస్వామి, గ్రామస్తులు శ్రీపతి బాపురావ్ పాల్గొన్నారు.

వన్ నేషన్..వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్: వన్ నేషన్..వన్ ఎలక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల కన్వీనర్, కోకన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్ నేషన్..వన్ ఎలక్షన్ వల్ల జరిగే ప్రయోజనాలు, ప్రధాని మోదీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వారి అపోహలు తొలగించాలని, ఎన్నికల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, తుల ఆంజనేయులు, కొయ్యల ఏమాజి పాల్గొన్నారు.